క్లుప్తంగా

బ్యాంకును తరలించొద్దు



బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నాగార్జునసాగర్: గత 45 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న హిల్‌కాలనీలోని కెనరా బ్యాంకును హాలియాకు తరలించొద్దని స్థానికులు సోమవారం బ్యాంకు ఎదుట ధర్నా చేశారు. పైఅధికారుల ఆదేశాల మేరకు బ్యాంకు తరలిస్తున్నట్లు హిల్‌కాలనీ శాఖ మేనేజర్ చెప్పడంతో వారినే ప్రశ్నిస్తామని, అప్పటి వరకు బ్యాంకు కొనసాగించాలని కోరారు. బ్యాంకు సేవలకు అంతరాయం కలగడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ధర్నాను విరమింపజేశారు.

ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మండలం తుంగపాడు ఆదర్శ పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్– మిర్యాలగూడ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీఎం నాయుడు, పాఠశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, క్లబ్ సెక్రటరీ కుటాల రాంబాబు, డైమండ్ శ్రీను, శంకర్‌రెడ్డి, వెంకటరమణ, సోమయ్య, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

రాజీవ్ యువ వికాసాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మూడావత్ రవినాయక్, మల్లం మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం మిర్యాలగూడలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం కింద రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు రుణాలు ఇస్తామని చెప్పి, 20 నెలలు అవుతున్నా నేటికీ ఇవ్వలేదని ఆరోపించారు.

అర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలి

మాడుగులపల్లి: మండలంలో అర్హులైన వారికి పెన్షన్లతోపాటు ఇందిరమ్మ ఇళ్లు అందించాలని సీపీఐ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పబ్బు వీరస్వామి అన్నారు. సోమవారం మాడుగులపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, నాయకులు అబ్రహం, దుర్గమ్మ, స్వప్న, మంజుల, మారతమ్మ, అబ్బాస్, నాగమ్మ, రేష్మా, నాగమణి తదితరులున్నారు.

పనుల్లో వేగం పెంచాలి

పెద్దవూర: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ మానె ఉమాదేవి అన్నారు. సోమవారం పెద్దవూర మండలంలోని బట్టుగూడెం గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి వజ్ర నాగిరెడ్డి ఉన్నారు.

నూతన ఏపీఎంగా జానకి

వేములపల్లి: మండల నూతన ఏపీఎంగా ఎరుకల జానకి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన నిజాముద్దీన్ మిర్యాలగూడకు బదిలీ కాగా డీఆర్‌డీఏలో ఏపీఎంగా పనిచేస్తున్న జానకి వేములపల్లికి బదిలీపై వచ్చారు.

ఆలయ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో గల శ్రీసీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయ నూతన కమిటీని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాయిని మాధవరెడ్డి, కోశాధికారిగా మైల బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కదారి అంజయ్య యాదవ్, దూదిపాల శ్రీధర్ రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, కేసాని లింగారెడ్డి, మారం రవీందర్ రెడ్డి, ఊట్కూరి వేమన్ రెడ్డి, జ్ఞానేశ్వర్, ధనుంజయ, బొడిగె శంకర్, బూడిద మల్లేష్ యాదవ్, నూతనగంటి ఈశ్వర్, కుంభం యాదగిరి గౌడ్, తోటపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యం కావాలి

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్రంలో బీసీల హక్కులు సాధించుకునేందుకు రాజకీయ పార్టీలకతీతంగా ఐక్యం కావాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. సోమవారం మిర్యాలగూడలోని బీసీ హాస్టల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పట్టేటి రమేష్, శంకర్, గంగాధర్, రమేష్, కోటేష్, వీరస్వామి, ఉపేందర్, రవి ఉన్నారు.

పేదలకు బీఆర్ఎస్ అండ

త్రిపురారం : పేదలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని త్రిపురారం మండల బీఆర్ఎస్ అడహక్ కమిటీ అధ్యక్షుడు పావనగుండ్ల వెంకటాచారి అన్నారు. సోమవారం జీఅన్నారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు గడప గడపకు తిరుగుతూ గ్రామంలో ప్రజా సమస్యల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, అనుముల శ్యాం సుందర్ రెడ్డి, మహిళా విభాగం కార్యదర్శి గగ్గెనపల్లి వనజ, భైరం కృష్ణ, కలకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జనావాసాల్లో వానరాల బెడద

- దాడులు చేస్తుండడంతో భయాందోళనలో ప్రజలు
- అటవీ ప్రాంతాలకు తరలించాలని వేడుకోలు



మిర్యాలగూడలోని రెడ్డికాలనీలో ఇంటి ఆవరణలో తిరుగుతున్న వానరాలు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో కోతుల బెడదతో ప్రజలు సతమతమవుతున్నారు. గుంపులుగా సంచరించడంతో పాటు ఇళ్లల్లోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకుపోతున్నాయి. ఈక్రమంలో దాడులు చేస్తున్నాయని కాలనీ ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు వీటిని దూరప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

16 ప్రాంతాల్లో కోతులు బెడద ఎక్కువ..

మున్సిపాలిటీలో 48 వార్డులుండగా ప్రధానంగా రెడ్డికాలనీ, ముత్తిరెడ్డికుంట, అశోక్‌నగర్, రైల్వే స్టేషన్ రోడ్డు, రవీంద్రనగర్ కాలనీ, హౌజింగ్‌బోర్డు, విద్యానగర్, హనుమాన్‌పేట, ఇస్లాంపుర, చైతన్యనగర్, బంగారుగడ్డ, తాళ్లగడ్డ, సీతారాంపురం, కృష్ణాకాలనీ, కృష్ణమానస కాలనీ, నందిపాడు శివారు, రామచంద్రాగూడెం తదితర ప్రాంతాల్లో కోతులు ఎక్కువగా ఉన్నాయి. గతంలో కోతులను పట్టుకునేందుకు మున్సిపల్ శాఖతో ఒప్పందం చేసుకునేవారు. అనంతరం వాటిని ఒకే చోట ఉంచి సంరక్షించేవారు. లేకుంటే అడవి ప్రాంతాల్లో వదిలివేసేవారు. మున్సిపాలిటీలో కోతుల సంఖ్య గతంలో 100 వరకు ఉండగా ప్రస్తుతం అన్ని వార్డుల్లో కలిసి 500 వరకు ఉన్నాయి. గతంలో గుంటూరు జిల్లా నుంచి తీసుకువచ్చి కోతులను పట్టి బోనులో వేసి అటవీ ప్రాంతాలకు తరలించేవారు. అయితే కోతులు పట్టించేందుకు ముందుగానే అటవీ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం వ్యయప్రయాసలతో కూడుకున్నది కావడంతో ప్రస్తుతం వాటిని పట్టడానికి ఎవరు కూడా ముందుకు రావడం లేదు. కేవలం బోనులను పెట్టి కోతులను పట్టుకోవాలని చూస్తున్నప్పటికీ పెద్దగా ఫలితం లేకుండా పోయింది.

అధికారుల నుంచి స్పందన లేదు



మిర్యాలగూడ పట్టణంలో కోతులు బెడద విపరీతంగా ఉంది. ఈ విషయంపై అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఎలాంటి స్పందన లేదు. ఒక్కసారిగా ఇళ్లలోకి వస్తుండడంతో ఇబ్బందిగా మారింది. ఇటీవల రెడ్డికాలనీలో రోడ్డుపై వెళ్తున్న చిన్నారి. ఓ వాహనదారుడిపై దాడికి యత్నించగా సమీపంలోని వ్యక్తులు కర్రలతో వెంబడించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాయి.

– మహ్మద్ అబ్దుల్ అలీం, ఇస్లాంపుర

అటవీ ప్రాంతాలకు తరలిస్తాం



మున్సిపాలిటీలో కోతుల బెడద విషయం ఇటీవలే నా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై మున్సిపల్ ప్రత్యేక అధికారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. కోతుల బెడద అధికంగా ఉన్న ప్రాంతాల్లో బోనులను ఏర్పాటు చేయించి వాటిని పట్టుకుంటాం.

– శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

మహనీయుల ఆశయాలను సాధిద్దాం

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి
- చేపూరు గ్రామంలో అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రావుల విగ్రహాల ఆవిష్కరణ



అంబేద్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి

గుర్రంపోడు : మహనీయుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కోరారు. సోమవారం రాత్రి గుర్రంపోడు మండలంలోని చేపూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రావుల విగ్రహాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, బుసిరెడ్డి పాండురంగారెడ్డి, విగ్రహ కమిటీ చైర్మన్ మారపాక నరేందర్, రాష్ట్ర రెడ్డి జాగృతి ఉపాధ్యక్షురాలు గీతారెడ్డి, డాక్టర్ మనోహర్, నాయకులు కొమ్ము రామలింగం, మేడి వెంకన్న, గడ్డం దిలీప్ రెడ్డి, సంకటి మహేష్, నిరసనమెట్ల మహేష్, కొమ్ము హరికుమార్, యాదయ్య, మేడి శంకర్, వెంకటేష్, అన్వేష్, సూదిని జగదీశ్వర్ రెడ్డి, చనమల్ల జగదీశ్వర్‌రెడ్డి, పోలె రామచంద్రం, ముత్యాలు, రాధాకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

క్రీడలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ప్రసాద్

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులకు ప్రతి క్రీడపై అవగాహన కల్పించే విధంగా క్రీడాపోటీలు నిర్వహించాలని ప్రముఖ ఇండియన్ క్రికెట్ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ అన్నారు. సోమవారం మిర్యాలగూడలోని శాస్త్ర స్కూల్‌లో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత సురేష్, ప్రముఖ ఆర్కిటెక్ట్ రమేష్, శాస్త్ర గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ మైనం చంద్రశేఖర్, కరస్పాండెంట్ పాశం శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సింధు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఏరియా ఆస్పత్రిలో వైద్యులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఆస్పత్రి భవన నిర్మాణాన్ని, వైద్యులు, సిబ్బంది, ఓపీ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆస్పత్రికి వస్తున్న డయాలసిస్ పేషెంట్లు, నిర్వహిస్తున్న సర్జరీలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నూతన భవన నిర్మాణంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న రూ.4.50కోట్ల బిల్లులు త్వరగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అందుకు సంబంధించిన వివరాలను సమర్పించాలని తెలిపారు. జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త డాక్టర్ మాతృనాయక్ మాట్లాడుతూ.. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో గత నెల 250 సర్జరీలు నిర్వహించడం జరిగిందని, దీంతోపాటు 20 మేజర్ సర్జరీలు చేశామని, మోకాలు చిప్పల మార్పిడి, హిప్ మార్పిడి చికిత్సలు 20 వరకు నిర్వహించామని తెలిపారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌సమరద్, తహసీల్దార్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

గుర్రంపోడు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా కృషిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం గుర్రంపోడు ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై అధికారులతో సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైనా నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారిని గుర్తించి జాబితా పంపించాలని చెప్పారు. వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా రుణం అందించే బాధ్యత ఏపీఓలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ సాగునీరు

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



గుర్రంపోడు డివిజన్ పరిధిలో డి-22 ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించేలా కృషి చేస్తున్నామని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. సోమవారం గుర్రంపోడు మండల పరిధిలో పిట్టలగూడెం వద్ద ప్రధాన కాల్వపై డి-22కు సాగునీటిని విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. గత పదేళ్లుగా కంపచెట్లు, పూడికలతో నిండిన మండల పరిధిలో 57 కిలోమీటర్ల మేర మేజర్ కాల్వలన్నంటినీ తాము ప్రత్యేక శ్రద్ధతో శుభ్రం చేయించడంతో కాల్వల్లో చివరి ఆయకట్టు వరకు నీరు చేరుతుందని తెలిపారు. డి- 22 కాల్వ నుంచి నేరుగా గేట్‌వాల్వ్ నిర్మాణంతో కాల్వ తవ్వడం ద్వారా చామలేడు చెరువు త్వరగా నిండుతుందని, ప్రధాన కాల్వ పైభాగంలో సూదినోని కుంటను లిఫ్ట్ ద్వారా నింపితే మూడు గ్రామాలు సస్యశ్యామలమవుతాయని గ్రామస్తులు కోరగా ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డివిజన్ ఈఈ నెహ్రూనాయక్‌కు సూచించారు. అనంతరం పిట్టలగూడెం పశువైద్య కేంద్రాన్ని పరిశీలించారు. అవసరమైన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్‌రెడ్డి, మండల నాయకులు చనమల్ల జగదీశ్వర్ రెడ్డి, కుప్ప అమరేందర్, మారపాక అంబేద్కర్, పులకరం యాదగిరి, బుషిపాక శ్రీను, మరెడ్డి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త అయితరాజు రాము అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యసేవల నిమిత్తం ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నర్సింగ్ కళాశాల పునఃప్రారంభానికి సన్నాహాలు

నాగార్జునసాగర్: స్థానిక ప్రభుత్వ కమలానెహ్రూ ఆస్పత్రికి అనుబంధంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులను పరామర్శించి, అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ ఉన్న నర్సింగ్ కళాశాలను తిరిగి పునఃప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లు సకాలంలో ఆస్పత్రికి రావాలని సూచించారు. అనంతరం సీఎంఓ డాక్టర్ భానుప్రకాశ్, వైద్యులతో ఆస్పత్రికి కావాల్సిన వసతులపై చర్చించారు. ఈయన వెంట జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి తదితరులున్నారు.

తక్కువ ధరకు ఇసుక అందించేందుకే సాండ్ బజార్



సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్

మిర్యాలగూడ: నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుకను అందుబాటులో ఉంచేందుకు ఈనెల 7న మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి మాట్లాడారు. సాండ్ బజార్‌ను రాష్ట్ర మైనింగ్ శాఖ ఎండీ భవిష్‌మిశ్రా ప్రారంభించనున్నట్లు చెప్పారు. టన్ను ఇసుక రూ.1250కు అందించనున్నట్లు, ఇందిరమ్మ లబ్ధిదారులు సాండ్ బజార్ నుంచి ఇసుకను తీసుకెళ్లాలన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని అదాని సిమెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో 3500 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వికలాంగులకు, ఒంటరి మహిళలకు మరో 1500 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంట్ అందించేందుకు సిమెంట్ పరిశ్రమ యాజమాన్యాలతో చర్చించినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశ్రమ ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ తాము ఈ విషయాన్ని తమ యాజమాన్యానికి తెలియ చేసి లబ్ధిదారులకు తక్కువ ధరకే సిమెంట్ అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

చట్టాలపై లీగల్ సెల్ జాగృతి అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

దేవరకొండ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి అనిత అన్నారు. సోమవారం దేవరకొండ మున్సిఫ్ కోర్టు ఆవరణలో నిర్వహించిన లీగల్ సెల్ జాగృతి అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ఈమేరకు లీగల్ సెల్ అథారిటీ సభ్యులు, పోలీసులు, న్యాయవాదులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేష్, న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, నెమ్మికంటి రమాశంకర్, డిండి సీఐ బీసన్న తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

నిడమనూరు : లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేసి ప్రభుత్వ సాయాన్ని పొందాలని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. సోమవారం నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ చైర్మన్ సత్యం భూమి పూజ చేసి, మంజూరు పత్రాలు అందజేశారు. ఎర్రబెల్లి గ్రామానికి 20 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముంగి శివమారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, నందికొండా మట్టారెడ్డి, నర్సింగ్ విజయ్‌కుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు పుట్ట మధు, బొంగరాల జానయ్య పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది



ప్రయాణికుడికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఏడీఎం

దేవరకొండ: బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన రూ.50వేలు విలువ గల ల్యాప్‌టాప్‌ను దేవరకొండ ఆర్టీసీ సిబ్బంది తిరిగి ప్రయాణికుడికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు. గుడిపల్లి మండలం కోదండాపురం గ్రామానికి చెందిన అనిల్ సోమవారం దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఇంజాపూర్ నుంచి కొండమల్లేపల్లికి వస్తున్నాడు. బస్సులో తన ల్యాప్‌టాప్ మరిచిపోయి కొండమల్లేపల్లిలో దిగిపోయాడు. దేవరకొండకు రాగానే బస్సులో ల్యాప్‌టాప్ గమనించిన డ్రైవర్ ఫయాజుద్దీన్, కండక్టర్ అలివేలుమంగ డిపో అధికారులకు అప్పగించారు. వివరాల ఆధారంగా డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు సదరు ప్రయాణికుడికి ల్యాప్‌టాప్ అందజేశారు. విధి నిర్వహణలో నిజాయితీ చాటుకున్న సిబ్బందిని అభినందించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థితో పాఠం చదివిస్తున్న ఏసీఎంఓ డీ.వీ.నాయక్

పెద్దవూర: పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏసీఎంఓ) డీ.వీ.నాయక్ అన్నారు. సోమవారం పెద్దవూర మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, అడ్మిషన్ రికార్డును పరిశీలించారు. అనంతరం ఏడు నుంచి తొమ్మిది తరగతులకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది రోజుల బాయ్స్ ఫోర్ చేంజింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. . కౌమారదశలో విద్యార్థులలో కలిగే శారీరక, మానసికంగా వచ్చే మార్పులతో పాటు హ్యూమన్ రైట్స్, హెల్త్‌పై ఆటలతో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలోజీ, వార్డెన్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు రాంరెడ్డి, ఎండీ.షబ్బీర్, సంధ్య, శ్రీనునాయక్, షాహీన్‌బేగం, శివలీల పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం



మిర్యాలగూడ టౌన్: శ్రీనివాస్‌నగర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీఓ, ఎంపీడీఓ

మిర్యాలగూడ టౌన్ : తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖల మమత, ఎంపీడీఓ శేషగిరిశర్మ అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలం చిల్లాపురం సెక్టార్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముర్రుపాలను తప్పకుండా బిడ్డకు పట్టించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి. వెంకటరమణ చౌదరి, సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ టీచర్ దుర్గాభవాని, శంకరమ్మ, సక్కు, హెల్పర్ మంగ, ఆరోగ్య శాఖ సిబ్బంది రూప, జయరాణి, రెహేనా, శ్రీనివాస్, కుమారీ తదితరులున్నారు.

ఈదులగూడెంలో తల్లిపాల వారోత్సవాలు

మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెం 1, 2, 3, 4 అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం నూతనంగా అంగన్‌వాడీలో చేరిన చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం పదిలం

వేములపల్లి: తల్లి పాలతో బిడ్డ ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సీడీపీఓ చంద్రకళ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం వేములపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పరిమి రజిని, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, శశికళ, ప్రైమరీ స్కూల్ సీఆర్పీ వాసంతి, ఏఎన్‌ఎం శైలజ, కవిత పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యం

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి మాట్లాడుతూ.. తల్లిపాలతోనే పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నారాయణమ్మ, శోభ, రమాదేవి, రేణుక, కమిలి తదితరులున్నారు.

కొండమల్లేపల్లి: పట్టణ కేంద్రంలోని వినాయకనగర్ గల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతను సీడీపీఓ ఖతీజ వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్ శోభ, ఆయా నాగమణి పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

హాలియా : తల్లిపాలతోనే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని చల్మారెడ్డిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జానపాటి శ్రీదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఏఎన్‌ఎం షేక్ గౌస్యా, ఆశా కార్యకర్త ఐలావతి పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం

పెద్దవూర: శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానమని సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. సోమవారం పెద్దవూర మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారంతో పాటు పోషక విలువలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సువర్ణ, మండల వైద్యాధికారి నగేష్, సీహెచ్‌ఓ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, హెల్త్ సూపర్‌వైజర్ జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



వేములపల్లి: శెట్టిపాలెంలో ప్రజలకు కేంద్ర పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

వేములపల్లి: బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదమాం భరత్ ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. బంటు సైదులు, సజ్జల నాగిరెడ్డి, చిర్ర సాంబమూర్తి, చలమల్ల సీతారాంరెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, పందిరి భాగ్యమ్మ, జానకిరాం రెడ్డి, పెదమాం ప్రసాద్, మజ్జిగపు రాంరెడ్డి, మాతంగి ప్రభాకర్, అనిల్, మహేష్, సతీష్, నరేష్, గౌతమ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

డిండి: దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలూనాయక్ కోరారు. సోమవారం ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సింకారు సైదా, డిండి పట్టణ అధ్యక్షుడు సాయిగౌడ్, రమేష్, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

చింతపల్లి: బీజేపీ పిలుపుమేరకు మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా సోమవారం చింతపల్లి మండల కేంద్రంలోని ఇంటింటికి బీజేపీ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి సమ్మిడి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రతి బూత్‌లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూ స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సముద్రాల నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చనిమోని రాములు, తూటుపల్లి రవి కుమార్, సీనియర్ నాయకులు దావ శ్రీనివాస్, కుకుడపు రామకృష్ణ, మాజీ సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్, శివార్ల రమేష్, నాళ్ల శివకుమార్, ప్రధాన కార్యదర్శులు వెన్నం శేఖర్, గొడుగు శ్రీనివాస్, గుడ్డేటి మధు, వనం శేషు, చెన్నయ్య, క్రాంతి రెడ్డి, పాల్గొన్నారు.

పోలేపల్లిలో బీజేపీ మహా సంపర్క్ అభియాన్

చందంపేట : బీజేపీ మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా చందంపేట మండలంలోని పోలేపల్లి గ్రామంలో సోమవారం ఇంటింటికి బీజేపీ.. ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏటి.కృష్ణ, నాగిళ్ల ఆంజనేయులు, బచ్చనబోయిన వెంకట్‌యాదవ్, మంగళగిరి శ్రీను, అనిల్, శివ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



చెన్నాయిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ

త్రిపురారం : పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి అన్నారు. సోమవారం త్రిపురారం మండలంలోని చెన్నాయిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ వెంట ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి, రాము పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

చింతపల్లి: మండల పరిధిలోని హోమంతాలపల్లి గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన హనుమంతు వెంకటయ్యకు చెందిన ఎద్దు మేత మేసేందుకు వెళ్లి వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు తగిలి మృతిచెందింది. దీని విలువ రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

సామాజిక తనిఖీ

కొండమల్లేపల్లి : మండలంలోని గ్రామపంచాయతీల్లో గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 15 రోజులుగా సామాజిక తనిఖీ కొనసాగుతోంది. ఈనెల 6న అన్ని గ్రామాలకు కలిపి ప్రజా వేదిక ద్వారా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలరాజురెడ్డి సోమవారం తెలిపారు.